United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb & Mar),2026

# ఎండ్లూరి కవిత పురాణ ప్రతీక

డా. పొనుగోటి రవికుమార్,
తెలుగు విభాగధిపతి,అసోసియేట్ ప్రొఫెసర్,
ఎస్ఆర్ & బిజియన్ఆర్
డిగ్రీ&పిజీ కళాశాల(A), ఖమ్మం.

Article Received:16-01-2026 Article Modified:19-02-2026
Article Accepted:4-02-2026 Article Published:26-02-2026
DOI:10.37854/UIJMR.2026.3.1.204

**పరిచయం**:

ప్రముఖ కవి, రచయిత ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారు జనవరి 21,1959 లో నిజామాబాద్ లోని పాముల బస్తీలో ఎండ్లూరి దేవయ్య, శాంతాబాయిలకు ప్రథమ సంతానంగా జన్మించారు. హైదరాబాద్ వీధిబడిలో ప్రారంభమైన చదువు విశ్వవిద్యాలయం వరకు హైదరాబాద్ లోనే కొనసాగింది. నల్లకుంట ప్రాచ్య కళాశాలలో ఓరియంటల్ విద్య, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం .ఏ, ఎం.ఫిల్, పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి చేసారు. ఉపాధ్యాయునిగా ఉద్యోగజీవితం ప్రారంభించి, విశ్వవిద్యాలయ ఆచార్య స్థాయికి చేరుకున్నారు. సికింద్రాబాద్ వెస్లీ బాయ్స్ ఉన్నత పాఠశాలలో తెలుగుపండిట్గా ఉద్యోగం చేసారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, అసోసియేట్ ప్రొఫెసర్ గా, ఆచార్యులుగా, శాఖాధిపతిగా రాజమండ్రి సాహిత్యపీఠానికి, డీన్ గా బాధ్యతలు నిర్వహించాడు. హైదరాబాద్ విశ్వ విద్యాలయం తెలుగువిభాగంలో సీనియర్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న సమయంలో 28 జనవరి 2022 న అకాలమరణం చెందారు.

**రచనలు:**

తెలుగు దళిత కవిత్వంలో తనదైన ముద్ర వేసుకున్న ఎండ్లూరి వర్తమానం, కొత్త గబ్బిలం, నా అక్షరమే నా ఆయుధం, మల్లెమొగ్గల గొడుగు (మాదిగ కతలు), నల్లద్రాక్ష పందిరి, వర్గీకరణీయం, గోసంగి, కథానాయకుడు జాషువా, తెలి వెన్నెల తదితర రచనలు గావించి, తెలుగు సాహితీ క్షేత్రంలో తమదైన స్థానాన్ని పదిలపరచుకొన్నారు.

**ప్రతీక:**

అల్పాక్షరాలలో అనల్పార్థ రచనకు తోడ్పడే అభివ్యక్తి ద్రవ్యాలలో ప్రతీక ఒకటి. ఒక వస్తువుకి ప్రతినిధిగా మరో వస్తువును నిలిపి తద్వారా అనుభూతిని పాఠకునిలో కలిగించడమే ప్రతీక.

**పురాణప్రతీక**

United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb & Mar),2026

'చెప్పదలచుకున్న విషయానికి పురాణ సంబంధ ప్రతీకలను ఎన్నుకుని చెప్పడం. పురాణాల్లో అనేక పాత్రలూ, విషయాలు విభిన్న తరహాల్లో ఉంటాయి. వాటి నుంచి చెప్పదలచుకున్న విషయానికి తగిన పాత్రనూ విషయాన్నీ, సందర్భాన్నీ ప్రతీకలుగా ఎన్నుకుని చెప్పడం. ఇలా పురాణప్రతీకలను ఉపయోగించడం వల్ల కవి చాలా వివరాలు ఇవ్వకుండానే అసలు విషయాన్ని పాఠకులకు పూర్తి స్థాయిలో అందించవచ్చు. ఎందుకంటే పురాణ సంబంధ విషయాల పరిజ్ఞానం అందరికీ తెలిసి ఉంటాయి. (నళిని.ఎస్.ఎస్: 2009, సాహిత్య విమర్శపదాల డిక్షనరీ,113).

పురాణప్రతీకలకు సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పునాది ఉంటుంది. ఆ సమాజ భౌతిక నిర్దిష్ట, చారిత్రక, వాస్తవిక పునాదిపై నిర్దిష్ట జనసమూహం చేసిన కల్పితగాథలే పురాణం. అందువల్ల పురాణాలు సాంస్కృతిక నిర్మాణాలు. స్పష్టంగా చెప్పాలంటే పురాణం ఒక సమాజ భాషణం లేదా వాగ్వ్యవహారం. అందుకే Roland barthes పురాణం గురించి Myth is a speech (Jonathan Culler. 1989) అంటాడు. "Myth లేని సమాజం వుండదు. మిత్ అంటే అబద్ధం కాదు. మిత్ అంటే పురాణం. పురాణం అబద్ధం కాదు. అనుభవ వాస్తవికతకు అనేక ముసుగులు తొడిగి, వాస్తవాన్నీ అజ్ఞాతం చేస్తే అది పురాణం అవుతుంది. ఆ పురాణం ఒక నారేటివ్ సమాజాన్ని ఆవహిస్తుంది. అందుకే ఫ్రాంజ్ బోస్ పురాణం అనేది సాంస్కృతిక ప్రతిఫలనం అన్నాడు. అయితే, అది ఏ వర్గ సంస్కృతి ప్రతిఫలనం? వెండీ డొనిగర్ వినిర్మాణం చేసిన పురాణాలన్నీ వైదిక హిందూ సంస్కృతిని ప్రతిఫలించాయి. జ్యోతీరావు పూలే, రెవల్యూషనరీ అంబేద్కర్, తంద్రై పెరియార్ వంటి మహామహోపాధ్యాయుల వినిర్మాణం చేసి వ్యాఖ్యానించినవి కూడా అవే" (జిలుకరశ్రీనివాస్: 2025, ద్రావిడ మహాసముద్రం ఒక ఐడియాలాజికల్ మెటఫర్, ద్రావిడ మహాసముద్రం).

'పౌరాణిక నేపథ్యంతో ఆధునిక జీవితాన్ని కవిత్వంలో ఆవిష్కరించడాన్ని మిథోపోయి అంటారు' (రవికుమార్, మేడిపల్లి, 2001:76). సమకాలీన జీవితాన్ని తమ కవిత్వంలో ఆవిష్కరించడానికి కవులు పౌరాణిక నేపథ్యాన్ని స్వీకరించడం ఆధునికకాలం నుంచే తెలుగులో గమనించవచ్చు. దళితకవిత్వంలో పురాణ ప్రతీకలను విశ్లేషించే పనిని లక్ష్మీనరసయ్య 'దళిత సాహిత్యం - తాత్విక దృక్పథం' రచనలో, శిఖామణి 'దళిత సాహిత్య తత్వం' రచనలో చేశారు. పురాణ ప్రతీకలు కవిత్వంలో ప్రయోగించడం కొత్తగాదు. కందుకూరి 'సరస్వతీ నారద విలాపం' నుండి మొదలు మైనార్టీ కవిత్వానంతర కవిత్వంలో కూడా పురాణ ప్రతీకల ప్రయోగం కనిపిస్తుంది. ఇది ప్రతి నూతన కవిత్వ ధోరణి వాదంగా స్థిరపడే క్రమంలో తన కవిత్వ అర్థనిర్మాణ (Poetic Semantic Structure) అవసరాన్ని గుర్తించిన ఫలితంగా జరుగుతోంది.

దళితకవిత్వం ఉద్యమంగా నిలదొక్కుకునే క్రమంలో పురాణ ప్రతీకలను విరూపం చేసింది. ఈక్రమాన్ని దళితకవులు అందిపుచ్చుకున్నారు. హిందూ పురాణగాథల్లో దళితపాత్రలకు జరిగిన అన్యాయాల్ని,హిందూ పౌరాణిక దేవుళ్ళ, నాయకుల డొల్లతనాన్ని వివరంగా కవిత్వీకరించారు. అందులో భాగంగా వేదాలు, ఉపనిషత్తులు, మనుస్మృతి,

పురాణాలు, ఇతిహాసాలు దళిత సైద్ధాంతిక ప్రశ్నల ముందు తల వంచుకున్నాయి. రాముడు, కృష్ణుడు, మనువు, ఇంద్రుడు, శంభూకుడు, వాలి, ఏకలవ్యుడు, ద్రోణాచార్యుడు, వశిష్ఠుడు, అరుంధతి, జాంబవంతుడు, శూర్పణఖ, తాటకి మొదలయిన అనేక హిందూ పురాణ పాత్రలు దళిత కవిత్వంలో ప్రతీకలుగా కనిపిస్తాయి.

వేదాలను ఈ దేశ సాంస్కృతిక సంపదగా అగ్రకులాలు కీర్తిస్తాయి. వాటి ప్రామాణికత తిరుగులేనిదని ప్రచారం చేశాయనవచ్చు. వేదాల్ని దేవుడు సృష్టించాడని, వాటిని ప్రశ్నించే అధికారం మానవ మాత్రులకు లేదన్నారు. వాటిని వల్లించే అధికారం, అధ్యయనం చేసే హక్కు కేవలం బ్రాహ్మణులదే అన్నారు. వేదాలకు దైవత్వాన్ని ఆపాదించినాక అగ్రకుల బ్రాహ్మణుల సొత్తుగా మారాయి. వాటిని పఠించడం వల్ల బ్రాహ్మణులు ప్రత్యేక సామాజిక హోదాను పొందారు. సమాజంపై ఆధ్యాత్మికత సాధనంగా తిరుగులేని ఆధిక్యాన్ని పొందారనవచ్చు. అందుకే ఎండ్లూరి సుధాకర్ గోదావరిని వేదంతో పోల్చి పచ్చి అవకాశవాదితనాన్ని ఆపాదిస్తూ కొత్త గబ్బిలానికి చెబుతున్నారు.

"ఇక్కడి గోదావరి వేదంలా కాదు
పచ్చి అవకాశవాదిలా ప్రవహిస్తుంది" (కొత్త గబ్బిలం)

స్వార్థం కోసం ఎలాంటి కుట్రలు, కుతంత్రాలకైన వెనుదియారని గబ్బిలానికి తెలియజేస్తున్నారు. వేదాల మీద ఆధిపత్యం ఉంటే సమాజంపై ఆధిపత్యం సులువు అవుతుందని వేదాల్ని ప్రశ్నించరాని ప్రమాణాలుగా బ్రాహ్మణులు ప్రచారం చేశారు. మనుస్మృతి కాలం నాటికి సామాజిక కులాధిపత్య చట్టాలు సామాజిక ఆమోదం పొంది అమల్లోకి వచ్చాయి. వాటిని ఇంకా కఠినతరం చేశాయి. ఫలితంగా ఆధునిక కాలంలో కూడ కూడ సామాజిక పరిస్థితులలో ఎటువంటి మార్పు రాలేదని తెలియజేయడానికి 'ఆత్మకథ' కవితలో

"నా వెనుక వేదమంత్రాలు నినదిస్తుంటే
నాచెవుల్లో సీసం పోగల గావు కేకలు
తాండవిస్తుంటాయి" (ఆత్మకథ: చిక్కనవుతున్న పాట)

వేదం వింటే చెవుల్లో సీసం పోయడం, చదివితే నాలుక కోయటం, విన్నవాటిని వల్లించినా, మననం చేసుకున్నా ముక్కలుగా శూద్రుణ్ణి నరకడంవంటి కఠిన శిక్షలద్వారా సమాజంపై బ్రాహ్మణం కులాధిపత్యం కొనసాగిందనవచ్చు. ఇలా కొన్ని వేల సంవత్సరాలు కొనసాగిన దోపిడిని ప్రశ్నిస్తూ 'ఆత్మకథ' కవితలో ఆవిష్కరించారనవచ్చు. ఇలా వేదాలను దళిత కవిత్వం పురాణ ప్రతీకల ద్వారా ప్రశ్నించి తూలనాడింది. సమాజం మీద వేదాల పట్టును తిరస్కరించింది. హేతు ప్రధానంగా, ప్రశ్నించి, వాదించి సమాధానాలను రాబట్టింది. వేదాలు పురాణ ప్రతీకలుగా కనిపించినా బ్రాహ్మణ కులవ్యవస్థ ఆధిపత్యానికి ప్రాతినిధ్యం వహిస్తాయి.ఈ దేశ అక్రమణ ఆయుధాలుగా చిత్రీకరిస్తూ, దళిత అనుభవాలతో వ్యవస్థీకరించాడు. దళిత కవిత్వం వేదాల్ని అంబేద్కర్ హేతువాద తర్కంలోంచి విమర్శించి వాస్తవికతను ప్రకటించింది.

United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb & Mar),2026

మనువు మనుస్మృతిని చెప్పాడని బ్రాహ్మణులు వాదిస్తారు. అతని వాక్కుని శాసన సమానంగా భావిస్తారు. దళితకవిత్వం మనువును విమర్శించినంతగా మరొకర్ని విమర్శించలేదు. 'నెత్తుటి ప్రశ్న' కవితలో

"నన్ను నలుగురిలో
అసహ్య జంతువుని చేసిన మనువు
నా నల్లని నుదిటి మీద బలవంతంగా
నిషిద్ధ ముద్ర వేసినప్పుడే
నాజాతంతా క్రమక్రమంగా
హత్య చేయబడింది" (నెత్తుటి ప్రశ్న: వర్తమానం).

ప్రాచీన కాలంలోనే గాక ఆధునిక కాలంలో కూడా మనువు రాజ్యమేలుతున్న తీరుపై దళిత కవిత్వం యుద్ధాన్ని ప్రకటించింది. వర్ణధర్మాల అమలును శాశ్వతం చేసే ప్రయత్నాల్ని నిరసించే క్రమంలో మనువును, మనుస్మృతిని దళితవాదం నిష్కర్షగా విమర్శించింది. మొత్తంగా చూసినపుడు మనువు పురాణ ప్రతీకగా కనిపించినా దాని సమకాలీన సామాజికోద్యమ నేపథ్యంలో కుల అణచివేతకు దోపిడీకి ప్రతినిధిగా మనువును దళిత కవిత్వంలో ఎండ్లూరి ప్రకటించారు. వేల సంవత్సరాల దళితుల కడగండ్లకు కారణమైన సామాజిక కులదోపిడీకి ప్రతీక అనే రాజకీయార్థంలో వాడడం జరిగింది. మనుస్మృతిని సాంస్కృతిక ఆధిపత్యాన్ని వ్యవస్థీకృతం చేసిన ఒకానొక పౌరాణిక గ్రంథార్థంగా తీసుకోవడం జరిగింది.

"గబ్బిలమా !
నీపాదాలకు నా కవిత్వపు
కొత్త జోళ్ళు తోడుగుతున్నాను
రామయాణం కాదు ఇవి నెత్తిన పెట్టుకోవడానికి
శ్రీ వారి సన్నిధి కాదు వెండి చెప్పుతో
మాడు మీద కొట్టడానికి" (కొత్త గబ్బిలం)

రామాయణంలో 'రాముడు' అనే పురాణపాత్ర సచ్ఛీలుడు, ధర్మబద్ధుడు అనే అర్థ నిర్మాణాన్ని కలిగి ఉంది. అందువల్ల రాముణ్ణి విశ్వసించే వారెక్కువ. అయితే దళిత కవిత్వం ఆ నిర్మాణాన్ని వినిర్మాణం చేసింది. వాలిని, శంభూకుడిని రాముడు హత్య చేయడం అధర్మం. కానీ రామాయణం ఆ హత్యలను ధర్మం కోసం చేసిన హత్యలుగా చిత్రించడం హిందూమత హీనతకు చిహ్నంగా దళిత కవిత్వోద్యమం భావించిందనవచ్చు. అందువల్ల రాముడు ఆదర్శపురుషుడు అనే భ్రమను తిరస్కరించి దళితప్రతీకగా శంభూకుణ్ణి ఆదర్శవ్యక్తిగా ప్రకటించింది.

United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb & Mar),2026

"రాముడు నారక్షకుడు
కాదు హంతకుడు
గుండె కాలిన గొంతు
సుబ్రాభాత శ్లోకంలా ఉండదు..
నాకాలు నోకని గర్భాలయాలు గొడ్రాళ్లయ్యాయి" (నిమ్న లిపి: నల్లద్రాక్షపందిరి)

"రాముని దురాక్రమణను పెద్ద ఎత్తున ప్రతిఘటించిన ఖ్యాతి కిష్కింధ గిరిజన రాజైన వాలికి దక్కుతుంది. వాలిని చెట్టుచాటు నుండి సుగ్రీవుడి కోసం రాముడు హత్య చేస్తాడు. "వాలిహత్య రాముని శీలంపై ఒక మాయనిమచ్చ"అని(అంబేద్కర్.బి.ఆర్.1993:366) వ్యాఖ్యానించాడు. నిజంగా రాముడు ధర్మయుద్ధం చేసేవాడైతే వాలిని దొంగదెబ్బ తీయాల్సిన అవసరం లేదనవచ్చు. పైగా సుగ్రీవుడి అధర్మకుట్రను నిరసించి వాలి సహాయం కోరితే సీతదేవిని చాలా సులభంగా తెచ్చిచ్చేవాడు. కాని రాముడు అందుకు భిన్నంగా వ్యవహరించాడు. అందుకే దళిత కవిత్వం రాముని తమ దేవునిగా గుర్తించక హంతకుడిగా ప్రకటించింది.

"శంభూకుడి తలను నరికిన చేతులు
ఏవైనా ఆయుధం మాత్రం ఒక్కటే
…హత్యా వ్యూహాలు ఒక్కటే
ఆధునిక శంబూకుడి నెత్తుడు తల
మళ్ళీ ఈ భూమిలోంచి మొలకెత్తుతుంది
...శంబూకుడి నెత్తుటి తల
తూర్పు కోట సుమ్మం మీద
వెయ్యి నమ్మకాల కిరణాలలో వెలుగుతుంది
కవి శంబుకా!
నీ తల మీద ఒట్టు
...ఇక నీతల లోంచి
కొత్త శంబుక శకం పుడుతుంది." (శంబుక శకం: పదునెక్కినపాట)

బ్రాహ్మణుల శాసనాన్ని ధిక్కరించిన మొదటి తిరుగు బాటుదారుడు శంభూకుడు. బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని తిరస్కరించి అతి సామాన్యుడైనా అంటరానివాడు సైతం దేవలోకానికి తపో మహిమతో వెళ్ళవచ్చని నిరూపించే ప్రయత్నం చేశాడు. ఇది శంభూక ప్రతీక వెనుక ఉన్న అర్థనిర్మాణం. బ్రాహ్మణీయ ఆధిపత్యంపై తిరస్కారం ప్రకటించి

United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb & Mar),2026

తిరుగుబాటు చేసిన శంభూకుడు శూద్రజాతికి ఆదర్శవంతుడైనాడు. శంభూక ప్రతీక ఒక చారిత్రక, వాస్తవిక అర్థనిర్మాణం కలిగి ఉంది. శంభూకుడు తరతరాలు దళిత జాతి అన్యాయానికి గురైన విషయానికి ప్రతీక. శంబుక తల ప్రతీకాత్మక విప్లవ బీజంగా మారింది. ఇక్కడ శంభూకుడు ఒక వ్యక్తి కాదు. ఒక ఉద్యమం, సామూహికచైతన్యం. సామాజిక అసమానతలు రాజకీయ అణచివేతలు, దళిత ప్రతిఘటనలకు ప్రతీకగా రూపాంతరం చెందింది. అందుకే సామాజిక మార్పును కోరుకుంటుంది.కవి ఎండ్లూరి ప్రయోగించిన పురాణప్రతీకలన్నీ స్థిరమైన,అచేతన వస్తువులుగా కాకుండా సజీవమైన,చైన్యవంతమైన సామాజిక మార్పులకు సాధనాలుగా పునఃవ్యాఖ్యానించరని చెప్పవచ్చు.

దళితులకు వర్తమాన పరిస్థితులలో జరుగుతున్న అన్యాయాన్ని వివరించేటందుకు పూర్వం నుండి దళితులపై జరుగుతున్న దౌర్జన్యాల్ని వివరించటానికి ఒక ఉపమానంగా, ఒక ప్రతీకగా శంభూకుణ్ణి దళిత కవిత్వం స్వీకరించిందనవచ్చు. ఇతిహాస యుగంలో శంభూకుణ్ణి హత్య చేసినట్లే, ఆధునిక యుగంలో రాజ్యం కవి శంబూకను హత్య చేయించింది. అందుకే ఈ అసమాన రాజ్యవ్యవస్థను కవి ఎండ్లూరి తిరస్కరించారు. ఇలా శంభూకుణ్ణి పురాణ ప్రతీకగా గ్రహించినా ఆధునిక సందర్భానికి అన్వయించకోవడం వల్ల అభివ్యక్తి గాఢత సాధ్యమైంది. పౌరాణిక ప్రతీక అయిన శంభూకుడు నిర్దిష్ట రాజకీయ, సామాజిక, సాహిత్య సందర్భాల్లో కొత్త అర్థాల్ని పొందింది.

దళితకవిత్వం భారతాన్ని పురాణార్థంలో స్వీకరించడం లేదు. తన అభివ్యక్తిలో భాగంగా ఉద్దేశిత అంశాన్ని ప్రభావవంతంగా చెప్పడం కోసం కవితలో ఆధునిక సందర్భంలో అలంకారంగా, సంకేతంగా, ప్రతీకగా ప్రయోగించింది. 'ఆత్మకథ'కవితలో

"మయసభలో నా ఆత్మకథ ఆవిష్కరించబడింది
బహిరంగ వేదికల మీద
నా సన్మానం మొదలైంది
ఇప్పుడు నామెడలో
దండలు పడుతుంటే
నిన్నటిగాయాలు ఉలిక్కిపడుతున్నాయి..
ఏ రోడ్డు మీదో నా చిన్నప్పటి గురువులు కనిపిస్తే
గద్దను చూసిన కోడిపిల్లలా
నాబోటన వేలు గుప్పిట్లో దాక్కుంటుంది" (ఆత్మకథ: చిక్కనవుతున్నపాట)

పేర్లు చెప్పకుండానే ద్రోణాచార్యుడు లాంటి గురువుల అకృత్యాలను ప్రతీకాత్మకంగా ఎండ్లూరి బట్టబయలు చేసి బోనులో నిలబెట్టారని చెప్పవచ్చు. నేర్పని విద్యకు ఏకలవ్యుడి కుడిచేతి బోటనవేలు గురుదక్షిణగా తీసుకున్న

United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb & Mar),2026

ఘటనను మననం చేసాడు, దళితులకు చదువును దూరం చేసిన బ్రాహ్మణీయ విద్యా వివక్షతలను శక్తివంతంగా ఎత్తి చూపుతు'నెత్తుటిప్రశ్న'కవితలో

."నిన్నటి చరిత్ర బోటనే వేళ్ళనే కోసింది
వర్తమానం ఐదు వేళ్ళని నరికేస్తుంది
బహిరంగం గానూ! రహస్యం గానూ
ఘటసర్పం మా నీడన్ని వెంటాడుతుంది" (నెత్తుటిప్రశ్న: వర్తమానం)

వెనకటికి, ఇప్పటికి ఏమి మార్పులేదని చెబుతూ నిన్నటి కంటే వర్తమానంలో మరింత భయానక పరిస్థితులు దాపురించయని కవి హెచ్చరిస్తున్నాడు. 'తెలంగాణా'ఉత్తరం'కవితలో

"ఏం రాయాలె
శాన పరేషాన్ల బడ్డం
ఎటూ సుదరాయిస్త లేదు
బుగుల్ బుగుల్గి బతుకుతాన్నం
నాత్రిల్ల నిద్రపడ్తలేదు
అయిసు పోరగాండ్లమీద
నిగరానీ బెట్టింద్రు
దర్వాజలు గొట్టి
జీపులల్ల యేస్క పోతున్నరు
మొన్న అయితారం ఊరి మీద బడి
ఆగమాగం జేసింద్రు
ఏం జెప్పాలే
గిట్ల రాసుకుంటబోతె
సమ్మక్క సారక్క జాతరంతైతది." (తెలంగాణా'ఉత్తరం': వర్తమానం)

తెలంగాణ ప్రాంత ప్రజల కష్టాల కడగండ్లు అద్దం పట్టేలా తేనెతోనల తొవ్వ తెలంగాణ భాషలో సమ్మక్క సారక్క జాతరతో పోల్చి సరికొత్త అభివ్యక్తిని సాధించాడు. ప్రతిఘటనా చిహ్నాలు ఎల్లమ్మ (రేణుక), సమ్మక్క, సారమ్మ, గంగమ్మ మొదలైన దేవతలను దళితస్త్రీల అణచివేతకు అన్వయింపజేశాడు. దళితుల దేవతలు ప్రత్యేకంగా ఉన్నారని కంచ

United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb & Mar),2026

ఐలయ్య 'నేను హిందువు నెట్లయిత?' అనే గ్రంథంలో నిరూపించారు. 'డక్కలిపిల్ల'కవితలో దళితస్త్రీలను పోల్చడానికి దళితదేవతల్ని ఉపమానాలుగా వాడటం కనిపిస్తుంది.

"వాళ్ళమ్మ రేణుకాదేవిలా వెంటనడుస్తుంటే
ఉచ్చులు భుజాన వేసుకొని కుక్కల గుంపుతో
అయ్య జాంబపురాణమై
మెట్లకిన్నెర మీటుతుంటే
భూమి బొంగరమై ఒక సంచార దేశంగా వాళ్ళ
పొట్టచుట్టూ తిరుగుతూ ఉండేది...
ముక్కోటి దేవతలు ఉసిళ్లయి ముసురుతుంటే
ఇంద్ర ధనస్సు గాడిదతోకకు ముడేసుకు వచ్చేది
కామధేనువు రొచ్చు పవిత్ర పంచకమైన
దేశంలో బాలిక గాడిదెలు మాత్రమే నమ్ముకునేది" (డక్కలిపిల్ల: నల్లద్రాక్షపందిరి)

కామధేనువు, ఇంద్రధనస్సును దోపిడీ సూచకాలుగా వాడి, దళిత దేవతలను ప్రధానీకరించాడు.

అలాగే 'మైసమ్మమరణం' కవితలో

"సమస్త కల్మాషాన్నీ కడిగేసే
గంగమ్మతల్లిలా కనిపించేది" (మైసమ్మమరణం: నల్లద్రాక్షపందిరి)

కల్మాషాన్నీ కడిగేసే గంగమ్మ తల్లిలా అని దళిత స్త్రీలను కళాశక్తికి ప్రతీకలుగా మలిచాడు.దళితుల విద్య పునరుద్ధరణ కోసం 'నిమ్నలిపి' కవితలో

"కవిత్వం కడుపు పండించడం
తరతరాల మా వెలి విద్య
ఇప్పుడు సరస్వతి
శాశ్వతంగా మా వాడ కోడలైయింది" (నిమ్నలిపి: నల్లద్రాక్షపందిరి)

ఇప్పుడు దళిత చైతన్యంతో సరస్వతి "దళితవాడ కోడలు" అయిందని ఆత్మవిశ్వాసం ప్రకటించాడు. వాల్మీకి, వ్యాసుల వంశాన్ని దళితులకు చెందినదిగా ప్రకటించి తరతరాలుగా కవిత్వం రాస్తున్న తమని వెలివేశారని చెబుతున్నాడు. అంతేగాక తమని మాత్రం వెలేసి తమ విద్యల్ని దోచుకున్నారని ధ్వన్యాత్మకంగా చెప్పాడు. కాని ఇప్పుడు దళిత చైతన్యంతో సరస్వతిని అంటే విద్యలన్నింటిని దళితులు చేజిక్కించుకున్నారు. కనుక బ్రాహ్మణుల ఇంట పుట్టిందంటున్న సరస్వతి శాశ్వతంగా దళితచైతన్యంతో వాడ కోడలైందని ఆత్మవిశ్వాసంతో చెప్పాడు. బౌద్ధజ్ఞాన

United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb & Mar),2026

ప్రతీకలను హిందూ పురాణాలతో పోల్చి, దళిత, బహుజన స్థలాల్లో బ్రాహ్మణియ ఆక్రమణలను బోధివృక్షం ద్వారా వ్యక్తీకరించాడు.

"ఇక్కడ బోధివృక్షానికి
పురాణాల తోరణాలు వేలాడతాయి" (కొత్త గబ్బిలం)

బ్రాహ్మణీయ అమానవీయ చర్యల ద్వారా మానవీయ బౌద్ధాన్ని నామరూపం లేకుండా చేయడానికి ప్రయత్నం చేసి వారి ఆరాధ్య ప్రాంతాలను ఆక్రమణ చేశారని పై కవిత పంక్తుల తెలియజేసయనవచ్చు. హిందూమత వికృత శిశువైన వర్ణవ్యవస్థ పాటించే వివక్ష నుండి బయటపడేందుకు క్రైస్తవ మతాన్ని కొందరు దళితులు స్వీకరించారు. అయినా హైందవ సంస్కృతి నిండిన సాంఘిక వ్యవస్థలో జీవిస్తున్నారు. వారిని కులం వెంటాడుతుంది. కనుక వారి జీవితాల్లోకి పూర్తి వెలుగురేఖలు ప్రసరించలేదు. వివక్ష మాత్రం అలాగే కొనసాగుతుంది. కొందరు దళిత కవులు క్రైస్తవ మత సంస్కృతి నేపథ్యం నుండి తమ భావాలను, అనుభూతులను కవిత్వం ద్వారా వ్యక్తం చేస్తున్నారు. క్రైస్తవ మైథాలజీని పదునుగా వాడుకున్న కవులలో ఎండ్లూరి సుధాకర్, సతీష్ చందర్, మద్దూరి నగేష్ బాబు, పైడి తెరేష్ బాబు, మద్దెలశాంతయ్య మొదలైనవారు ముందువరసలో ఉంటారు.'నిలువెత్తునిప్పు'కవితలో హిందూ క్రైస్తవ మతాల మధ్య హింసను,ఘర్షణలు తెలియజేస్తుంది. ఆ హింసల మధ్య దళితుల దిన స్థితిని సూచిస్తూ పోరాటానికి ప్రేరేపిస్తుంది. 'నిలువెత్తునిప్పు' కవితలో

"శూలానికి శిలువకి మధ్య
నా ప్రాణం గిజగిజలాడుతుంది" (నిలువెత్తునిప్పు: నల్లద్రాక్షపందిరి)

అగ్రవర్ణ స్త్రీలు, దళిత స్త్రీలను ఏవిధంగా బాధపెడుతున్నారో భారతంలోని ద్రౌపది వస్త్రాపహరణ ఘటనలను నేటి పరిస్థితులకు అన్వయించి 'నల్లతల్లి' కవితలో

"నిన్ను ఆ కారణం గానూ అన్యాయం గానూ
కొంగు పట్టి లాగి కొడుతున్నపుడు
ఆడ దుశ్శాసినులు నీ కోకలు చింపుతున్నప్పుడు
ఒక కొడవలి లాగో ఒక కాళిక లాగో మారకుండా
ఆడ క్రీస్తులా అలా బేలాగావుండి పోయ్యే దానివి
నాబాల్యనికి భాష లేదు గానీ!
నీలాంటి బాధ మరోభారతమై వుండేది ...
జీవితాంతం ఊడిగమై పోయి జీడి గింజిల్లా మారిన
నీ నల్లవేళ్ల సాక్షిగా నేనిప్పుడు

United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb & Mar),2026

కొత్త భారతానికి
కొత్త తలనవుతున్నాను"                    (నల్లతల్లి: పదునెక్కినపాట)

ఈ కవితలో కొడవలి కమ్యూనిష్టులకు, కాళికా హిందుత్వకు, అందులోని హింసావాదులకు, వారి అణచివేత చర్యలకు ప్రతీకలు. ఆడక్రీస్తు ప్రేమ, శాంతికి అణచివేయబడ్డ దళిత స్త్రీలకు ప్రతీక. దళిత స్త్రీలు భారతీయ సామాజిక వ్యవస్థలో కుల, పురుషాధిపత్య దోపిడీకి గురవుతున్న దళితతల్లుల బాధలే అసలైన భారతమని ఎండ్లూరి సుధాకర్ తేల్చిచెప్పారు. క్రీస్తు పునరుత్థానం చెందినట్లే దళిత చైతన్యం వినూత్న శక్తితో పునరుజ్జీవనం అవుతుంది. అప్పుడు క్రీస్తులాగ పీడకులను వదిలివేయమని దళిత చైతన్యం చెప్పదని 'ఐదోవాచకం' కవితలో

"మాకు జీజస్ 'లా' వద్దు
మోజస్ 'లా' కావాలి
మోషే ధర్మశాస్త్రం అమలు చేయండని ధర్నాలు చేయండి
కంటి కన్నూ పంటికి పన్నూ
తలకాయకు తలకాయా బదువివ్వాలని
బహిరంగంగా ఊరేగింపులు తియ్యండి..
ఇకపై మా శవాలు ఏభాషలో మాట్లాడలో
పునరుత్థాన కాలం నిర్ధారిస్తుంది
కొత్త వాచకంతో కొత్తకాలమే
సమాధానం చెబుతుంది"                    (ఐదోవాచకం: పదునెక్కినపాట ).

ఇకపై మా శవాలు ఏభాషలో మాట్లాడలో పునరుత్థాన కాలం నిర్ధారిస్తుంది అంటే దళితులు రాజ్యాధికారం పొందే వరకూ శత్రువుని సజీవంగా ఉంచమని చెప్పడం. తమకు విధించిన శిక్షలే వారికి విధించి బదులు తీర్చుకుంటామనే హెచ్చరిక ఆఖరి పాదాల్లో కవి ప్రతీకాత్మకంగా ధ్వనింపజేస్తున్నాడు. 'మాదిలా!'కవితలో

"నీకూ నాకూ మధ్య నల్లగడ్డి వేస్తూన్న
కొత్త నారదుల తుంబురులు పగలగొడదాం
నలుసుల మీద దృష్టి నిలుపుతూనే
ముందు మనకంట్లో దూలాన్ని తీసేసుకుందాం
తేటపడుతున్న కొత్త చూపులో
తొలకరి వేళ పలకరించుకుందాం

United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb & Mar),2026

నల్లతోటలో రెండు కొమ్మల్నీ అంటుకడదాం
ఇది రెండు ఋతువులు కలిసిన పొద్దు
ఇప్పుడు రెండు రుతువులకు ఒకే పేరు" (మాదిలా! : పదునెక్కిన పాట)

'నారద,తుంబురులు' పాత్రలు సాంప్రదాయికంగా సంగీతానికి సంబంధించినవ ఎండ్లూరిహ సుధాకర్ వాటిని సామాజిక విభజనలను సృష్టించే శక్తులుగా చిత్రికరించారు. "నల్లగడ్డి వేస్తూన్న కొత్త నారదుల తుంబురులు" అనే ప్రయోగం ద్వారా కవి సమాజంలో విభజనలు సృష్టించే మాధ్యమాల, మధ్యవర్తులు పేరుతో మాయాజాలం చేస్తున్నారు. అలాంటి ఆధిపత్య కులాలకు అవకాశం ఇవ్వకుండా మాల మాదిగ కులాలు అంతర్గత సమస్యలను పరిష్కరించుకోని ఐక్యంగా ఉండాలని కోరుతున్నారు. 'నిమ్న లిపి' కవితలో

"నారింజ రంగు వేషంలోనే ద్వేష జాలముంది
నువ్వు మానవుణ్ణి సేవించనూ లేవు
మాధవుణ్ణి పూజించనూ లేవు
నువ్వు హిందూ మహా సముద్రమంత హింసవి" (నిమ్న లిపి: నల్లద్రాక్షపందిరి)

అనే పంక్తులలో హిందూ మతాన్ని 'హిందూ మహా సముద్రమంత హింస'గా వ్యాఖ్యానించడం ద్వారా, మతం పేరుతో జరిగే హింసను బహిర్గతం చేస్తాడు. సందర్భాలలో ఉపయోగించడం ద్వారా సంప్రదాయ అర్థాలను ప్రశ్నించే గొంతుక అనవచ్చు. 'దండోరా' కవితలో

"సమస్తమూ నేనై నావాళ్లై
నాజాతి గురించి మాట్లాడుతున్నాను
తొడ కోసి ఇవ్వడానికి శిబి చక్రవర్తిని కాను
మెడ నరుకుతుంటే తల వంచే శంబూకుడ్ని కాను
ఇంత కాలానికి చింతనిప్పుల కళ్లత
నిలబడ్డ వీరబహుణ్ణి
రక్తం చిందించడానికైనా
సిద్ధపడిన కన్నమనీణ్ణి
కృతజ్ఞత నా రక్త లక్షణం
సమానత్వం నా జాతి తత్త్వం" (దండోరా: పదునెక్కినపాట)

ఈ కవితపంక్తులలో 'జాతి' అనే భావనకు నూతన అర్థం కల్పిస్తారు. సంప్రదాయంగా జాతి అనేది వంశపారంపర్యంగా వచ్చేదిగా పరిగణించబడుతుండగా, దీనిని ఒక తాత్విక, రాజకీయ గుర్తింపుగా "సమానత్వం నా జాతి తత్త్వం" అని ప్రకటించడం ద్వారా, జాతి వ్యవస్థకు వ్యతిరేకంగా ఒక ప్రత్యామ్నాయ తత్త్వాన్ని ప్రతిపాదిస్తారు. పురాణాల్లోని ఇద్దరి పాత్రలో శంబూకుని చిత్రణ వంచించబడే వ్యక్తిగా కాకుండా, ప్రతిఘటనకు ప్రతీకగా ప్రకటిస్తాడు. శిబిచక్రవర్తి దానశీలతకు ప్రసిద్ధి చెందినప్పటికీ, తొడ కోసి ఇవ్వడం వంటి త్యాగాలను నిరాకరిస్తూ, సమానత్వ సూత్రాన్ని ప్రతిపాదిస్తాడు. 'పాదముద్రలు' కవితలో

"ఇవాళ నాది అగ్నిముఖం
నాచేతులు వజ్రాయుధాలు
నేనిప్పుడు నడిచే ఖడ్గాన్ని
నన్నేవరు తాకలేరు
ఏ నాటికైనా
నా పాదముద్రలు
చారిత్రిక రథ్యలవుతాయి…" (పాదముద్రలు: చిక్కనవుతున్నపాట)

అనే ప్రయోగంలో అగ్ని, వజ్రాయుధం వంటి పురాణ ఆయుధాలను వ్యక్తిగత మరియు సామూహిక ప్రతిఘటనకు ప్రతీకలు. ఇది పురాణాల్లోని ప్రతీకలను దళితుల ఆయుధాలుగా పునర్ వ్యాఖ్యానించడం. నడిచే ఖడ్గం అనడం కత్తికి జీవ లక్షణాన్ని ఆపాదించి, ఏనాటికైన దళిత పాదముద్రలే చరిత్రను నడిపిస్తాయని ప్రతీకాత్మకంగా ప్రకటిస్తున్నాడు.

**ముగింపు:**

పురాణ ప్రతీకలను దళిత కవిత్వం ఆధునిక అవసరాలకొరకు ప్రయోగించింది. పురాణ ప్రతీకల ప్రయోగంవల్ల అభివ్యక్తిలో గాఢత వస్తుంది. పురాణేతిహాసాలలోని దోపిడికి ప్రాతినిధ్యం వహించే ప్రతీకల్ని, పీడనకు బలైన వారికి ప్రాతినిధ్యం వహించే వాటిని దళితకవిత్వం స్వీకరించి బలమైన అభివ్యక్తిని సాధించింది.

దళితకవిత్వంలోని పురాణప్రతీకలు, దళితసాహిత్యోద్యమం, హేతువాదదృక్పథాన్ని, నాస్తికమార్గాన్ని అనుసరించవలసిన అవసరాన్ని దళితవాదాలకు, ఇతర ప్రగతిశీలవాదాలకు తెలియజేస్తున్నాయి (శిఖామణి,1998:14). మొత్తంగా చూసినప్పుడు ప్రతీక తన అర్థాన్ని విస్తృతం చేసుకోవడం, బహుముఖ అర్థ ప్రధానంగా కాక చారిత్రిక అవగాహనతో సమకాలీన పరిస్థితిని ప్రతిబింబించడం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రతీక లక్షణం అనేక అర్థాల్ని ఇవ్వడం

United International Journal of Multidisciplinary Research (UIJMR)

An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal

ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb & Mar),2026

అన్నది గమనించవచ్చు. అయితే ప్రతీక వెనుక అనుభవ నేపథ్యం ఉంటుందని అంగీకరించడం వల్ల ఎండ్లూరి సుధాకర్ తో సహా దళిత కవుల ప్రయోగంలో గందరగోళం లేదు. కవితాభివ్యక్తిలో అస్పష్టత కనిపించదు. ఇది కొత్తతరం పాఠకుడికి సరైన సాహిత్యస్పర్శని, స్పృహని కలిగించిందనవచ్చు.

ఎండ్లూరి సుధాకర్ గారి కవిత్వంలో పురాణ ప్రతీకలతో సంప్రదాయ అర్థాలను పూర్తిగా తిరస్కరించారు. పురాణ ప్రతీకలను సమకాలీన సామాజిక, రాజకీయ సందర్భాలతో సమన్వయం చేసి సంప్రదాయ విశ్వాసాలను ప్రశ్నించారు. వేరు వేరు పురాణ సంప్రదాయాల నుండి ప్రతీకలను తీసుకొని వాటిని కలగలిపి సరి కొత్తఅర్థాలు సృష్టించారు. పురాణ ప్రతీకలు కేవలం సాహిత్య అలంకారాలు మాత్రమే కాక, సామాజిక మార్పుకు సాధనాలు. ప్రతీకలను వ్యవస్థాగత విమర్శతో పురాణాలను పునర్వ్యాఖ్యానించడం, సంప్రదాయాలను ప్రశ్నించడం మాత్రమే కాకుండా, సామాజిక సమానత్వ సమాజం కోసం కొత్త దృష్టిని ప్రతిపాదిస్తారు. వారి కవిత్వంలో, పురాణ ప్రతీకలు భూతకాలంలో మొదలై వర్తమానం నుండి భవిష్యత్తు తరానికి, సమకాలీన సామాజిక సమస్యలతో సంభాషించడానికి ఒక శక్తివంతమైన భాషను అందిస్తాయి. ఈ పద్ధతి కేవలం సాహిత్య ప్రయోగం మాత్రమే కాకుండా, రాజకీయచర్య అవుతుంది. ఎండ్లూరి సుధాకర్ ప్రతీకలను ప్రయోగించి హిందూ కులవ్యవస్థకు ఆలంబనగా ఉన్న బ్రాహ్మణవాదాన్ని బలహీన పరచడానికి ప్రయత్నించినట్టు కనిపిస్తోంది. "కులానికి దైవిక ప్రాతిపదికను ఆపాదిస్తారు. అందువల్ల మీరు కులాన్ని నిర్మూలించాలంటే దానికి ఆధారంగా కల్పించబడ్డ శాస్త్రాల యొక్క వేదాల యొక్క అధికారికతను నిర్మూలించవలసి ఉన్నదన్న మాట" అని అంబేద్కర్ చేసిన వ్యాఖ్యను నిజం చేసే కృషి ఎండ్లూరి కవిత్వంలో కనిపిస్తుందనవచ్చు.

**ఆధార గ్రంథాలు**:

1.అంబేద్కర్. బి. ఆర్. రచనలు

2.నళిని. ఎస్. ఎస్: 2009, సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ, నవోదయా బుక్ హౌస్, హైదరాబాదు.

3.రవికుమార్, మేడిపల్లి. 2001: ఆధునిక కవిత్వంలో మిథోపొయి, గమనం, తెలకపల్లి రవి (సంపా), హైదరాబాదు.

4.లక్ష్మీనరసయ్య.జి:1999. 'దళిత సాహిత్యం-తాత్విక దృక్పథం', విజయవాడ, హైదరాబాదు, దళిత సాన ప్రచురణ.

5.సుధాకర్,ఎండ్లూరి:1994.దళిత సాహిత్యం - సామాజిక తాత్విక భూమిక, తెలుగుసాహిత్యం చారిత్రికనేపథ్యం. (సం.) చంద్రశేఖర్ రెడ్డి, డి. హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణ.

6.సుధాకర్,ఎండ్లూరి:1995,చిక్కనవుతున్న పాట,శ్రీనివాస్,త్రిపురనేని, లక్ష్మీనరసయ్య.జి (సంపా), కవిత్వం ప్రచురణ,విజయవాడ, హైదరాబాదు.

7.సుధాకర్,ఎండ్లూరి:1995.వర్తమానం.మానస ప్రచురణలు.రాజమండ్రి.

United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb & Mar),2026

8.సుధాకర్, ఎండ్లూరి:1996, **పదునెక్కినపాట**, లక్ష్మీ నరసయ్య. జి (సంపా), దళితసాన ప్రచురణ, విజయవాడ, హైదరాబాదు.

9.సుధాకర్, ఎండ్లూరి:2001(నవ)- 2002(జన).**ఢిల్లీ తెలుగువాణి**, ఢిల్లీ.

10.సుధాకర్, ఎండ్లూరి:2002 **నల్లద్రాక్షపందిరి**, జె. జె. ప్రచురణలు, సికింద్రాబాద్.

11.**సుధాకర్,ఎండ్లూరి. సాహిత్యం, రచనలు.**

12.శ్రీనివాస్, జిలుకర : 2025, *ద్రావిడ మహాసముద్రం ఒక ఐడియలాజికల్ మెటఫర్,* **ద్రావిడ మహాసముద్రం**, మట్టి ముద్రణలు, హైదరాబాదు.

13.శిఖామణి:1998,'**దళితసాహిత్యతత్వం**'తెనాలి,హైదరాబాదు.

14.Jonathan Culler: 1989. **Deconstruction**. London: Routledge.